# హక్కులు కోల్పోయి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కౌలు రైతాంగం

**రాష్ట్ర** సేద్యంలో 60 శాతంపైగా కౌలురైతులే ఉన్నారు. ఆ తర్వాత చిన్న, సన్నకారు రైతులు కీలకపాత్ర పోషిస్తున్నారు. దీన్ని గమనిస్తే సేద్యంలో వీరిద్దరిదే ముఖ్య భూమికగా ఉంది. తమ స్వేదబిందువుల ద్వారా వీరు పండించే వివిధ రకాల పంటలను భూస్వాములు, సంపన్నవర్గాలు కొల్లగొట్టుకుపోయి విలాసవంతమైన జీవితాలు గడుపుతుంటే, పంటలు పండించిన కౌలురైతులు, పేదరైతులు అతి దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు.

కౌలు విధానం భూస్వామ్య వ్యవస్థలో అంతర్భాగంగా ఉంది. పాలకులు చేసిన భూసంస్కరణ చట్టాల వలన భూసంబంధాల్లో మార్పులుగానీ, భూస్వాముల భూములు పేదలకు పంపకంగానీ జరగలేదు. ఇప్పటికీ భూమిలేని గ్రామీణ పేదలు 60 శాతంగా ఉన్నారు. వీరికి వ్యవసాయ పనుల ద్వారా లభించే ఉపాధే జీవనాధారం. ఈ ఉపాధి తరిగిపోతూ వస్తున్నది. సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచ వాణిజ్య ఒప్పందం, వ్యవసాయ ఒడంబడిక వలన నాలుగు నెలలు లభించే వ్యవసాయ పనులు 80 రోజులకు పడిపోయాయి. వ్యవసాయంలో అవసరంలేని యాంత్రీకరణ అందుకు కారణంగా ఉంది.

భూమిలేని గ్రామీణ పేదలు, కౌలు సేద్యం ద్వారా, కూలిపనుల ద్వారా ఉపాధి పొందుతున్నారు. వ్యవసాయ పనుల ద్వారా లభించే ఉపాధి తరిగిపోవటం, ఇతర పనులేవీ గ్రామీణ ప్రాంతంలో లేకపోవటం వలన కౌలు భూమికి పోటీ ఏర్పడింది. ఫలితంగా కౌలురేట్లు పెరిగాయి. కౌలు విధానంలో వచ్చిన మార్పులు భూస్వాముల దోపిడీని ఎక్కువ చేసింది. మొదట భూస్వామి భూములు సాగుచేసినందుకుగాను కౌలుదారునికి కొద్దిపాటి భూమి పండించుకొనేందుకు యిచ్చేవారు. తర్వాత పండిన పంటలో పాలు విధానం, ఆ తర్వాత ముందే కౌలు నిర్ణయం జరగటం జరిగింది. ఇది ధాన్య రూపంలో ఉండేది. పంట పండిన తర్వాత కౌలును భూస్వామి తీసుకొనేవాడు. ప్రస్తుతం ధాన్యం, డబ్బు కౌలు అమలు జరుగుతున్నది. డబ్బు కౌలు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో విస్తృతంగా కొనసాగుతున్నది. సేద్యానికి ముందే ఎకరాకి ఇన్నివేలు ఇవ్వాలని భూ యజమాని, కౌలురైతుతో ఒప్పందం చేసుకొంటున్నారు. పంటకు ముందుగానే కౌలు డబ్బులు చెల్లించాలి. ఇది భూ యజమానికి లాభదాయకంగా మారింది. డబ్బులు ముందుగానే అందటంతో పంట పండేదానితో అతనికి సంబంధం ఉండదు. కౌలు తగ్గింపులు ఉండవు. పంట నష్టాలను కౌలురైతే భరించాల్సి ఉంటుంది.

గతంలోలాగా కౌలురైతులు ఒకే స్వభావం కలిగిలేరు. ప్రస్తుతం వీరు రెండు రూపాల్లో ఉన్నారు. కౌలు సేద్యం ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకోవాలనుకొనేవారు. వీరు ఎకరా లేదా రెండు ఎకరాలు కౌలుకి తీసుకొని ఆ భూమిలో కుటుంబపాదీ పనులు చేస్తూ ఉంటారు. కౌలు భూమి ద్వారా అధిక ఆదాయం పొందాలనుకొనేవారు రెండో రకానికి చెందినవారు. వీరు 5 నుండి 15 ఎకరాలదాకా కౌలుకి భూమిని తీసుకొంటారు. సేద్యంలో ఎక్కువగా కూలీల చేత పనిచేయిస్తారు. అందుకు కావాల్సిన ఆర్థిక వనరులను కలిగి ఉండటమో లేదా అందుకు కావాల్సిన పరపతి వీరికి ఉంటుంది. ఇలాంటివారిని కౌలు రైతులనలేము. వీరిద్దరు కాకుండా వ్యవసాయ ఉపకరణాలున్న కొందరు ధనిక రైతులు కూడా ఇతర రైతుల భూములను కౌలుకి తీసుకొంటున్నారు.

భూస్వాములు, సంపన్నవర్గాలే కాకుండా రెండు లేదా మూడు ఎకరాలున్న కొందరు రైతులు కూడా తమ భూమిని కౌలుకి ఇస్తున్నారు. ముందుగానే డబ్బు రూపంలో కౌలు అందటం, అంతకు మించి సేద్యం ద్వారా ఆదాయం రాకపోవటం, అందుకు కారణం. ఇలాంటివారు కొద్దిమందిగా ఉన్నారు.

సరళీకృత ఆర్థిక విధానాల అమలు, ప్రపంచ వాణిజ్య ఒప్పందం ఫలితంగా సేద్య అవసరాలైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు విపరీతంగా పెరుగుతూ సేద్యపు ఖర్చులు రైతాంగానికి భారంగా మారాయి. ఇది కౌలురైతులకు తీవ్ర సమస్యగా పరిణమించింది. కౌలుకి, సేద్యానికి డబ్బు సమకూర్చు కోవటం గగనమైపోతున్నది. బ్యాంక్‌ల నుండి పంట రుణాలు కూడా వీరికి లభించటంలేదు. సర్వస్వం కుదవపెట్టి అధికవడ్డీలకు అప్పులు తెచ్చి సేద్యం చేయాల్సిన పరిస్థితుల్లో వీరు ఉన్నారు. పాలకుల నుండి ఎటువంటి సహకారం వీరికి అందటంలేదు. సాగునీటి వనరులున్న ప్రాంతంలో ఎకరా సేద్యానికి 26 వేలు, ఆ వసతి లేని ప్రాంతాల్లో 30 వేలు సేద్యపు ఖర్చులు అవుతున్నాయి. కౌలురైతుకి అదనంగా కౌలురూపంలో ఒక పంటకు 15 వేలు ఖర్చు అవుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో వారికి వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పటంలేదు.

కౌలురైతుల ఆందోళనోద్యమాల ఫలితంగా ఆంధ్రా కౌలుదారీ చట్టాన్ని 1956లో పాలకులు చేయక తప్పలేదు. చట్టంలో అనేక కంతలు ఉన్నప్పటికీ కౌలుదార్లకు కొన్ని హక్కులు కల్పించింది. ఒప్పందం ముగిసేవరకు కౌలుదారుని తొలగించకూడదని చట్టం పేర్కొంది. బ్యాంక్ రుణాలు పొందటమే కాకుండా, భూమిని తనఖా పెట్టి రుణాలు పొందే అవకాశం కౌలుదారునికి యిచ్చింది. కౌలు ఒప్పందం జరిగితేనే ఈ హక్కులు వర్తిస్తాయి. దీన్ని అడ్డుపెట్టుకొని ఒప్పంద పత్రాలు లేకుండా అయితేనే భూమి కౌలుకి ఇస్తామని భూస్వాములు బెదిరించటంతో, సేద్యానికి భూమి దొరకదన్న భయంతో అందుకు కౌలురైతులు ఆమోదించక తప్పలేదు. కౌలుదార్లు ఎవరన్నది తెలిసినప్పటికీ రెవిన్యూ అధికారులు, పాలకులు చట్టాన్ని అమలుపర్చే చర్యలు తీసుకోలేదు. చివరికి చట్టం అలంకార ప్రాయంగా మిగిలింది.

చట్టం అమలు జరగకపోవటం, భూమి తనకే కౌలుకి దక్కుతుందన్న నమ్మకం లేకపోవటం, నిరంతరం సేద్యపు ఖర్చులు పెరుగుతూ ఉండటం, పెట్టుబడి సమకూర్చుకోవటం సమస్యగా పరిణమించటం, బ్యాంక్‌లు మొండిచేయి చూపటం, పంటకు నష్టం జరిగినప్పుడు పరిహారం అందకపోవటం వంటి సమస్యలు కౌలు రైతాంగాన్ని చుట్టుముట్టాయి. ఇలాంటి పరిస్థితుల్లో సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించక వారికి తప్పలేదు. బ్యాంక్‌లు పంటరుణాలు ఇవ్వాలని, నష్టపరిహారం తమకే ఇవ్వాలని, కౌలుదారీచట్టాన్ని అమలుపర్చాలని రైతాంగం ఆందోళనబాట పట్టారు. క్రమంగా ఉద్యమంలో వర్గ దృక్పథం వెనక్కివెళ్ళి, ఆర్థికపరమైన డిమాండ్లు ప్రధానమై, చట్టాన్ని అమలుపర్చాలనే డిమాండ్ మరుగుపడుతూ వచ్చింది. రివిజనిస్టు పార్టీలకు చెందిన రైతు సంఘాలే అందుకు కారణమయ్యాయి.

కౌలురైతాంగంలో తీవ్రమౌతున్న వ్యతిరేకతను ప్రక్కకు మళ్ళించేందుకు ఆనాటి రాజశేఖరరెడ్డి ప్రభుత్వం బ్యాంక్‌ల నుండి వారికి రుణాలు ఇప్పిస్తామని చెప్పినా ఆచరణలో అమలు జరగలేదు. కౌలుపత్రాలు లేకుండా వారిని బ్యాంక్ మెట్లు ఎక్కటానికి కూడా బ్యాంక్ అధికారులు అనుమతించలేదు. ఇది విఫలమవటంతో రైతుమిత్ర గ్రూపుల ద్వారా రుణాలు అందిస్తామన్నారు. అదీ ఆచరణలో విఫలమైంది. కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం రుణ అర్హత కార్డులు యిచ్చి బ్యాంకుల్లో రుణాలు తీసుకోమన్నారు. బ్యాంక్ అధికారులు, భూ యజమాని అనుమతిపత్రం లేనిదే రుణం ఇవ్వమన్నారు. రుణ అర్హతకార్డులకు చట్టబద్ధత కల్పిస్తున్నామని 2011 సం॥లో కౌలురైతుల రుణ అర్హత చట్టాన్ని చేసింది. దీని ప్రకారం కౌలురైతులకు రుణ అర్హత కార్డులు ఇస్తుంది. ఆ కార్డుల ద్వారా బ్యాంక్‌ల నుండి రుణాలు పొందాలి. భూమిపై హక్కు ఉండదు. భూ యజమాని రుణ అర్హతకార్డుని ఆమోదించాల్సిన అవసరంలేదు. ఈ చట్టాన్ని వామపక్ష పార్టీలుగా చెప్పుకునే రైతు సంఘాలు శ్లాఘించాయి. 1956 కౌలుదారీచట్టం వీరి దృష్టిలో పనికిరానిదైపోయింది. ఆ చట్టాన్ని అమలుపర్చాలనే డిమాండ్‌ను అటకెక్కించి, 2011 చట్టాన్ని అమలు పర్చాలనే డిమాండ్ ముందుకు తెచ్చారు.

ప్రభుత్వం చట్టబద్ధంగా యిచ్చిన రుణ అర్హత కార్డులకు బ్యాంక్‌లు విలువ ఇవ్వలేదు. ప్రభుత్వానికి ముందుగానే ఈ వాస్తవం తెలుసు. తెలిసే రైతాంగాన్ని మోసం చేయపూనుకొంది. కొన్ని రైతు గ్రూపులకు, ఉదార భూయజమానుల ఆమోదం పొందిన కొద్దిమంది కౌలురైతులకు నామమాత్రపు రుణాలను మాత్రమే బ్యాంక్‌లు యిచ్చాయి. రుణ అర్హత కార్డులు కూడా కౌలురైతులందరికీ అందలేదు. అధికారంలోకి వస్తే కౌలు రైతులందరికీ రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ అందించి పంటల బీమా పథకాన్ని వర్తింపచేస్తానని చంద్రబాబు ప్రకటించాడు. అధికారంలోకి వచ్చిన తర్వాత చెప్పినవాటిల్లో ఒక్కటీ అమలు జరగలేదు. రుణ అర్హత కార్డులు కూడా కౌలుదార్లందరికీ ఇవ్వటంలోనూ విఫలమయ్యారు. గత సంవత్సరం డిసెంబర్‌లో 5,90,708 మంది కార్డులు జారీచేసి రూ. 7,000 కోట్లు రుణాలు ఇస్తామని చంద్రబాబు ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పింది. ఆచరణలో 70,666 మంది కార్డుదారులకు రూ. 174.63కోట్లు మాత్రమే యిచ్చారు. కౌలు గుర్తింపు కార్డులు లేనివారికి వ్యవసాయాధికారి ధృవీకరణతో రుణాలు ఇప్పిస్తామని చెప్పి 30,877 మందికి సర్టిఫికెట్లు ఇవ్వగా బ్యాంక్‌లు కేవలం రూ. 5.91 కోట్లు మాత్రమే యిచ్చాయి. మూడు జిల్లాల్లో ఒకటి రెండు సర్టిఫికెట్లపై రుణాలు యిచ్చినా, పది జిల్లాల్లో సర్టిఫికెట్లు పొందినవారిలో ఎవరూ రుణం పొందలేదు.

కౌలు ఒప్పందాలు లేని కారణంగా పంట రుణాలు, నష్టపరిహారాలు పొందలేకపోతున్న కౌలు రైతాంగం, మద్దతుధరల ప్రకటనలో కూడా తీవ్ర నష్టానికి గురౌతున్నారు. వివిధ పంటలకు ప్రభుత్వం ప్రకటించే మద్దతుధరలు – వరుసగా మూడు సంవత్సరాల పంట ఖర్చులు, ఉత్పత్తి, ఆదాయం ఆధారంగా నిర్ణయించ బడుతున్నాయి. బాగా దిగుబడి వచ్చే ప్రాంతాలనే అందుకు నమూనాగా తీసుకొంటున్నారు. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని ఎక్కువగా చూపెట్టి, తాను ప్రకటించే మద్దతు ధరలను సమర్థించుకొంటున్నారు. పంట ఖర్చుగా సొంత భూమి ఉన్న రైతు పెట్టిందే పాలకులు గీటురాయిగా తీసుకొంటున్నారు. కౌలురైతును పరిగణలోకి తీసుకోవటంలేదు. పంట ఖర్చుతోపాటు, కౌలు రూపంలో వారు అదనంగా ఖర్చుచేస్తున్నారు. ఇది సేద్యం క్రిందకే వస్తుంది. లోపభూయిష్టమైన మద్దతుధరలు – సొంతభూమి ఉన్న రైతాంగ ప్రయోజనాలకే విరుద్ధంగా ఉంటే, కౌలురైతులకు మరింత తీవ్ర నష్టదాయకంగా మారింది. సేద్యపు ఖర్చు కూడా రాని పరిస్థితుల్లో నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

ఉద్యమాలు, పోరాటాల ద్వారా సాధించుకొన్న అనేక చట్టాలను, హక్కులను పాలకులు హరించి వేస్తున్నారు. అందులో భాగమే 1956 కౌలుదారీచట్టాన్ని ప్రక్కనపెట్టి అది అమలుజరపకుండా, చట్టబద్ధంగా కౌలుదార్లకు లభించిన హక్కులను కాలరాస్తూ భూస్వాముల, సంపన్నవర్గాల ప్రయోజనాలను పాలకులు కాపాడుతున్నారు. ఇది పాలకుల వర్గ స్వభావం. పోరాటాల ద్వారా సాధించుకొన్న చట్టాలను, హక్కులను కాపాడుకోవటమా, నిరుపయోగమైన బలవన్మరణాలకు బలికావటమా? ఇదే కౌలు రైతుల ముందున్న ప్రశ్న. బలవంతంగా ప్రాణాలు తీసుకోవటంకన్నా హక్కును నిలబెట్టుకొనేందుకు పోరాటమార్గంలో తమ శక్తిని కౌలురైతులు ప్రదర్శించాలి. పాలకులకు లొంగి హక్కులను వదులుకోవటమంటే బానిసత్వాన్ని, దోపిడీని ఆమోదించటమే. గత పోరాటాలు అందించిన స్ఫూర్తితో 1956 కౌలుదారీ చట్టం అమలుకోసం, భూమిపై హక్కును సాధించుకోవటం ద్వారా భూస్వామ్య దోపిడీ బంధనాల నుండి బయట పడతామని గ్రహించి ఇతర గ్రామీణ పేదలతో ఐక్యమై సమిష్టిగా కౌలు రైతాంగం ఉద్యమించాలి.

oooo